నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ సబ్‌స్టేషన్ 33 కేవీ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కేపీహెచ్‌బీ 4వ ఫేజ్, ఆర్‌టీఓ కార్యాలయం ప్రాంతాలు, 15వ ఫేజ్, కైత్లాపూర్, వాటర్‌వర్క్స్ కార్యాలయం, మహేంద్ర అపార్టుమెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలు



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్ తదితరులు

మూసాపేట: మూసాపేటలోని మహవీర్ భక్త మండలి కార్యాలయం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక హోమాలు జరిగాయి. కార్పొరేటర్ మహేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, మహవీర్ భక్త మండలి సలహాదారులు జిల్లా గోపాల్, అధ్యక్షుడు సంతోష్‌కుమార్, జనరల్ సెక్రటరీ మహేష్ గౌడ్, ఉపాధ్యక్షులు జన్ను, కోశాధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ కాలనీ అసోసియేషన్ 2025 కేలండర్‌ను బుధవారం పీఏసీ చైర్మన్ గాంధీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ రత్న ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ బాబూరావు, సెక్రటరీ యాదిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రామనాథం, రామ్‌కోటేశ్వరరావు, హనుమంతరావు, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల పరిశీలన



మూసాపేట: బాలాజీనగర్ అపోలో మెడికల్ రోడ్డులో మాజీ కార్పొరేటర్ బాబూరావు, వాటర్ వర్క్స్ మేనేజర్ వైష్ణవి 60 ఫీట్ల రోడ్డులో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల పనులను బుధవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, భాస్కర్‌రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గచ్చిబౌలి: చికిత్స పొందుతూ బాలిక మృతి చెందిన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్కూటీ పంక్చర్ కావడంతో కింద పడి గాయపడ్డ బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నార్సింగిలో నివాసముండే సునీత తన మరదలు నందు(17) కలిసి స్కూటీపై ఈనెల 4వ తేదీన సాయంత్రం గచ్చిబౌలి నుంచి నార్సింగికి బయలుదేరింది. గచ్చిబౌలి జంక్షన్ సమీపంలో స్కూటీ టైర్ పంక్చర్ కావడంతో ఇద్దరు కిందపడ్డారు. తలకు దెబ్బ తగిలిన నందు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట: ప్రగతినగర్ వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో డిజిటల్ హ్యూమానిటీస్ గురించి మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సులో మానవుల ఉనికిపై డిజిటల్ సాంకేతికత ప్రభావం, సాంకేతికత ద్వారా మానవతకు జరుగనున్న మేలు గురించి ఉపన్యాసాలు, చర్చలు, ప్లీనరీ ప్రసంగాలు జరగనున్నాయని సదస్సు కన్వీనర్ డా.వై.వీ. సుధాదేవి తెలిపారు. సదస్సులో వివిధ దేశాల నిపుణులు పాల్గొన్నారు. నేటి కాలంలో తెలిసీతెలియని సలహాలు, నాటు వైద్యాలను ఖండించటానికి డిటిటల్ సాంకేతికత చాలా అవసరమవుతోందన్నారు. అనంతరం ఆచార్య డా.ప్రమోద్ నాయక్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ గురించి ఇటువంటి సదస్సుని నిర్వహిస్తున్నందుకు వీఎన్ఆర్ విజేఐఈటీని అభినందిస్తూ మున్ముందు కూడా తమ రెండు విద్యాసంస్థలు కలిసి పరిశోధించవచ్చని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కొత్త 'రేషన్'పై కోటి ఆశలు!

- కార్డు మంజూరుపై లబ్ధిదారుల ఎదురుచూపులు
- కొత్త పేర్లతోపాటు చేర్పుల, మార్పుల దరఖాస్తుల వెల్లువ

దాదాపు పదేళ్ల నుంచి కొత్తరేషన్ కార్డులు లేకపోవడంతో చాలామంది పేదలు కార్డుల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈ పదేళ్లలో కొత్త దంపతులు, కుటుంబాలతో వేరుగా ఉన్న వారితోపాటు పిల్లల పేర్ల కోసం అనేక కుటుంబాలు వేచిచూస్తున్నాయి. ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో వారు దరఖాస్తు చేసుకొని కొత్త కార్డుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.



బాలానగర్: దాదాపు పదేళ్ల కాలంలో పేదలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయలేదు. యేడాదికేడాది ఇదిగో అదిగో అంటూ ఊరించడమే తప్ప గత ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో చాలా కుటుంబాలకు కొత్తకార్డులు లేకుండానేపోయాయి. అంతేకాకుండా ప్రతీ ప్రభుత్వ సంక్షేమ పథకానికి తెల్లరేషన్‌కార్డును ప్రామాణికం చేయడంతో వారికి సంక్షేమ పథకాలు కూడా అందకుండానేపోయాయి. ఇప్పుడు కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు ప్రభుత్వం నుంచి ప్రకటన రావటంతో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురించాయి. సుమారుగా పదేళ్లుగా ఎదురుచూస్తున్న పేదలు, మధ్య తరగతి వాళ్ల కల ఫలించనున్నది.

దశాబ్దకాలంగా నిరీక్షణ..

దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న సుమారు 47 వేల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిస్తుంది. బాలానగర్ సహాయ పౌర సరఫరాల శాఖ కార్యాలయం పరిధిలో కూకట్‌పల్లి, బాలానగర్, కుత్బుల్లాపూర్ మండలాల పరిధిలో వేలాది కుటుంబాల్లో కొత్త దంపతులతోపాటు తల్లిదండ్రులతో విడిపోయి వేరే కాపురం ఉంటున్నవారు, గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వచ్చిన వారు అనేకం ఉన్నారు. దీంతో చాలా మంది యువతి, యువకుల పేర్లు తల్లిదండ్రుల కార్డులలోనే ఉండటంతో వారికి అనేక ప్రభుత్వ పథకాలు అందటం లేదు. అనేక పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా ఉండటంతో వాటికి దూరం కావాల్సి వస్తున్నది. 2016 సంవత్సరం నుంచి రేషన్ కార్డులలో ఎటువంటి కదలిక లేకుండాపోయింది. అయితే ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయంతో అడ్రస్ మార్పు, పేర్ల నమోదు, తప్పులు సరిచేయడం వంటివి చేయనున్నారు. బాలానగర్ సహాయ పౌర సరఫరాల శాఖ కార్యాలయం పరిధిలో 227 రేషన్ షాపులు ఉన్నాయి. అందులో 16 షాపులు పనిచేయటం లేదు. ప్రతి నెలా రేషన్ బియ్యం 42,32,867 లక్షల కిలోల బియ్యం సరఫరా అవుతున్నాయి. రేషన్ కార్డులు 199672 ఉన్నాయి. అందులో అంత్యోదయ, లెప్రసీ కార్డులు 4739 ఉన్నాయి. వికలాంగులు, లెప్రసి వారికి రేషన్ ఇచ్చే కార్డులు 22 ఉన్నాయి. కార్డులో పేర్లు చేర్చితే ఒక్కొరికి 6కిలోల బియ్యం అందజేయాల్సి ఉంటుంది. త్వరలోనే గ్రామ సభ నిర్వహించి మార్పులు చేసిన కార్డులు ప్రజలకు అందించనున్నారు.

ఆనందంగా ఉంది



మాది ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, సుమారు 10 సంవత్సరాల క్రితం జగద్గిరిగుట్టకు వచ్చి నివాసం ఉంటున్నాం. వచ్చిన కొద్ది రోజులకే కార్డుల్లో మా పిల్లల పేర్లు చేర్చటం కోసం దరఖాస్తు చేశా. త్వరలో పేర్లు కార్డులో నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నారు. చాలా ఆనందంగా ఉంది.

–విష్ణు, జగద్గిరిగుట్ట.

మంచి పరిణామం



మాది బౌరంపేట మా కుటుంబంలో నా భార్య పేరు చేర్చాలని దరఖాస్తు చేశాను. కార్డులలో పేర్లు నమోదు చేస్తున్నారని తెలిసి వచ్చాను. చిరు ఉద్యోగిగా పనిచేసే నేను ఆఫీసుకు వచ్చి ఖాళీ సమయంలో రేషన్‌కార్డు గురించి తిరుగుతున్నాను. త్వరలోనే నా భార్య పేరును చేరుస్తామని అధికారులు అంటున్నారు. ఇది చాలా మంచి పరిణామం.

–ఉదయ్, బౌరంపేట

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఓల్డ్ బోయిన్‌పల్లి: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బుధవారం టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరితో కలసి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరిగిన తీరును దరఖాస్తు దారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద వాడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలపై ప్రతి రోజు ప్రభుత్వం మానిటరింగ్ చేస్తుందని తెలిపారు. నాటి కేసీఆర్ పాలనలో ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దరఖాస్తు చేసుకోని వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, ముస్తఫా, షాయిన్‌షా, అస్లాం, అంజత్, షఫీ, అప్సర్, శ్రావణి, సభ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తు చేసుకున్న వారితో మాట్లాడుతున్న బండి రమేష్ తదితరులు

శ్రీసీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



శ్రీసీతారామచంద్ర స్వామి

కూకట్‌పల్లి: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ మొదటి వార్షికోత్సవం సందర్భంగా బాలాజీనగర్‌లోని సంజీవని ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారామచంద్రస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం అనంతరం స్వామివారికి లక్ష పుష్పార్చన, సాయంత్రం కాలనీ వాసులు, భక్తులచే దీపోత్సవం జరిగింది. పెద్ద ఎత్తును భక్తులు ఉదయం నుంచి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పీఆర్ నగర్ ఆటో స్టాండ్‌లో..



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: అయోధ్య రామమందిర ప్రాణ ప్రతిష్ఠ చేసి నేటితో సంవత్సరం పూర్తయిన సందర్భంగా పీఆర్‌నగర్ ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాముడి చిత్రపటానికి పూలమాలలు వేసి అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సంజయ్‌కుమార్, బాబు, శంకర్, రాజు, వెంకటరెడ్డి, ఆంజనేయులు, యాదగిరి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఎర్ర స్వామి, లీగల్ సెల్ సభ్యులు సద్గుణ రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్ నాయర్, రవి గౌడ్, శోభ రాజన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ చెరువు వద్ద కాలనీవాసుల నిరసన



ఎల్లమ్మ చెరువు వద్ద నిరసన తెలుపుతున్న కాలనీల ప్రజలు



ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంత కాలనీల జేఏసీ సభ్యులు ఆరోపించారు. బుధవారం కూకట్‌పల్లి, ఎల్లమ్మ బండ, ఎల్లమ్మ గుడి దగ్గర నుంచి ఎల్లమ్మ చెరువు వరకు ముక్కు మూసుకుని 'సేవ్ మస్కిటో', సేవ్ లేక్ డ్రైనేజీ స్మెల్, సేవ్ ట్రాఫిక్ జామ్స్' అంటూ ప్లకార్డ్స్ పట్టుకొని ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. భవ్యాస్ తులసివనం, నవోదయ కాలనీ, విజయనగర్ కాలనీ, శుభోదయ కాలనీ, హెచ్ఎంటి శాతవాహన నగర్, జయనగర్ కాలనీ, రామ్‌కి, శిల్పా బృందావనం, తదితర కాలనీలవాసులు జేఏసీగా ఏర్పడి భారీగా తరలి వచ్చి ఎల్లమ్మ చెరువు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దుర్వాసన, దోమల బెడదతో భాగ్యనగర్ కాలనీ నుంచి ఉషా ముళ్ళపూడికి వెళ్లే ఈ రహదారి ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నామని, అనేకమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముఖ్యంగా ఎల్లమ్మ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కతో దోమల ప్రబలి కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. సంవత్సరాల తరబడి సమస్యతో బాధపడుతున్నామని, పరిష్కరించటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. నిరసన కార్యక్రమంలో పలు కాలనీల అసోసియేషన్‌ల సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి సహకరించాలి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, అధికారులు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: ముళ్లకత్వ చెరువు వరకు ఏర్పాటు చేసే డ్రైనేజీ పైపులైన్‌కు గోపాల్ నగర్ కాలనీ వాసులు సహకరించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కొంతమంది ప్లాట్ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలియడంతో బుధవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి గోపాల్‌నగర్ కాలనీలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పైపులైన్ ఏర్పాటుకు అంతరాయం కలిగించిన వారిపై తగిన చర్యలు తీసుకుని వచ్చే వర్షాకాలం లోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు. ఈ డ్రైనేజీ పైపులైన్ గోపాల్‌నగర్ కాలనీ వాసులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అసోసియేషన్ వారందరూ కలిసి పనులు పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని కోరారు. పైపులైన్ నిర్మాణ పనులు ఆపితే మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వామి, వాటర్ వర్క్స్ జీఎం ప్రభాకర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్, డీఈ శంకర్, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలి



మోతీనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే జీవితానికి పరమావధి ఉంటుందని అయ్యప్ప సంక్షేమ సంఘం అధ్యక్షుడు లయన్ కెల్లా వెంకట్రావు అన్నారు. కొన్ని నెలల కిందట ఆర్థిక ఇబ్బందులతో అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌కు చెందిన రమేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిని పరామర్శించి అయ్యప్ప సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇద్దరు కుమార్తెలకు ఒకొక్కరికి 50 వేల చొప్పున పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసిన ఎఫ్‌డీ బాండ్లను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సీహెచ్ అనంత, కార్యదర్శి జి.సత్యనారాయణ పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌కు ఐడీబీఐ బ్యాంక్ చేయూత



ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐడీబీఐ బ్యాంక్ బుధవారం కుర్చీలు, కంప్యూటర్ టేబుల్స్, ఆంప్లిఫైర్, స్పీకర్ సెట్, బీరువా, వంట సామానులు అందజేశారు. ఐడీబీఐ ఆర్‌హెచ్ సందీప్ పట్నాయక్, కూకట్‌పల్లి డీజీఎం మురళీధర్‌లతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సదుపాయాలను ఉపయోగించుకొని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంక్ ఉన్నతాధికారులు, సిబ్బంది, స్కూల్ ప్రిన్సిపాల్, ఇన్‌చార్జి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన ఉండాలి



డిజిటల్ డిస్ప్లేబోర్డును ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: మేధో సంపత్తి హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి అన్నారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వాణిజ్య సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ వంటి ప్రాముఖ్యమైన అంతర్జాతీయ సంస్థలు మేధావుల హక్కులు, నియమాలను ఎలా రూపొందిస్తాయో వివరించారు. 18వ శతాబ్దపు సామాజిక విప్లవం,19వ శతాబ్దపు రాజకీయ విప్లవం , 20వ శతాబ్దపు సాంకేతిక, శాస్త్రీయ విప్లవం, 21వ శతాబ్దపు డిజిటల్, జ్ఞాన విప్లవాల ప్రగతి గురించి కూడా అవగాహన కల్పించారు. జాతీయ ఒప్పందాలు, ద్వైపాక్షిక ఒప్పందాలు, ప్రభుత్వ ఒప్పందాలు, జీఎటీఎస్ లపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

డిజిటల్ డిస్ప్లే బోర్డు ఆవిష్కరణ

కేపీహెచ్‌బీకాలనీ: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆధునిక డిజిటల్ డిస్ప్లేబోర్డును బుధవారం ఇన్‌చార్జి వీసీ డాక్టర్ వి. బాలకిష్టారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీఐసీయూ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ డిస్‌ప్లే బోర్డు యూనివర్సిటీకి ఆధునికతను చేకూర్చడమే కాకుండా విద్యార్థులు, సందర్శకులకు సమాచారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ కె. వెంకటేశ్వరరావు, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు, విభాగాల డైరెక్టర్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

హౌసింగ్ బోర్డులో అయోమయం!

- 24 స్థలాలకు రేపే వేలం
- 36 గజాలు మొదలుకొని 272 గజాల వరకు విక్రయం
- ఖాళీ స్థలాలను ఇవ్వకుంటే అడ్డుకుంటాం : ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వివిధ ఫేజ్‌లల్లో ఖాళీగా ఉన్న స్థలాలను వేలం పాట ద్వారా విక్రయించేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు రంగం సిద్ధం చేశారు. నోటిఫికేషన్ అనేక అనుమానాలకు తావిస్తోంది. కేపీహెచ్‌బీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ ఆవరణలో శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఏదైనా జాతీయ బ్యాంకులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వెస్ట్రన్ డివిజన్, తెలంగాణ హౌసింగ్ బోర్డు పేరుపై లక్ష రూపాయల డీడీ తీసుకుని హాజరు కావాలని ఇప్పటికే ప్రకటించారు.

30 గజాలకు కూడా వేలం

హౌసింగ్ బోర్డు చరిత్రలో ఇంత వరకు 30 గజాల వేలం వేయలేదని, ఇదే మొదటిసారని ఇక్కడి అధికారులు చెబుతున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలోని 5వ ఫేజ్‌లో 136 చదరపు గజాల స్థలాన్ని, 7వ ఫేజులో 146, 78 గజాల రెండు స్థలాలు, 9వ ఫేజ్‌లో 232 గజాలు, 99 గజాల స్థలాన్ని వేలానికి పెట్టారు. ఇక 15వ ఫేజ్‌లో ఏకంగా 30 గజాలు మొదలుకొని 272 గజాల వరకు మొత్తం 19 స్థలాలు వేలానికి పెట్టడం గమనార్హం. ఇందులో 48 గజాలు, 56 గజాలు, 66 గజాలు వంటి చిన్నా, చితకా స్థలాలు ఉండగా.. వాటికి కనీస రోడ్డు ఫేసింగ్ కూడా లేనటువంటివి ఉండటం విస్తు గొలుపుతోంది.


కాపాడలేక అమ్మకానికి..

హౌసింగ్ బోర్డు అధికారులు గతంలో లే అవుట్ చేసి ప్లాట్లు కేటాయింపు జరిపిన సమయంలో వాస్తుకు లేని చిన్నా చితక, వంకర, టింకరగా ఉన్న స్థలాలను ఎవరికి కేటాయించకుండా ఖాళీగా వదిలేశారు. అయితే అవే స్థలాలను నేడు అధికారులు అమ్మకానికి పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఏ మాత్రం వాస్తు ప్రకారం లేని స్థలాలు రోడ్డుకి పక్కనే ఉండి, రోడ్డు విస్తరణలో కోల్పోయే స్థలాలు కూడా ఇందులో ఉండటం అనుమానాలకు తావిస్తోంది. అసలే గజం రూ. 1.25 లక్షల పైగా కనీస ధరగా నిర్ణయించిన 15 ఫేజులో 80 అడుగుల రోడ్డు స్థలం భవిష్యత్‌లో 100 అడుగులకు విస్తరణ జరిగితే కొన్న వారి పరిస్థితి ఏంటనే సందేహాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. 7వ ఫేజ్‌లో రోడ్డు విస్తరణకు అవకాశం ఉన్న స్థలాల్ని కూడా వేలానికి పెట్టారు.

ఆలయ కల్యాణ మండపం సీజ్‌పై విమర్శలు

కేపీహెచ్‌బీలోని గోవర్ధన గిరిపై నిర్మించిన వేణుగోపాల స్వామి ఆలయ కల్యాణ మండపాన్ని నిర్వాహకులు అద్దెలకు ఇస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకున్నారంటూ అధికారులు సీజ్ చేయడం దుమారం రేపింది. నిజంగా నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోకుండా సీజ్ చేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరో వైపు 4వ ఫేజ్‌లో ఏకంగా హౌసింగ్ బోర్డు స్థలంలో వ్యాపార సముదాయం నిర్మించి పదుల కొద్ది మడిగెలను అద్దెకు ఇచ్చి లక్షలు వసూలు చేస్తున్న వారిపై హౌసింగ్ బోర్డు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని పలువురు నిలదీస్తున్నారు.

10 శాతం స్థలాలను అప్పగించాలి : ఎమ్మెల్యే



కేపీహెచ్‌బీ కాలనీలో లే అవుట్ ప్రకారం ఎమినిటీస్ కోసం వదిలిన 10 శాతం ఖాళీ స్థలాలను వెంటనే జీహెచ్ఎంసీకి అప్పగించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేస్తున్నారు. వంద గజాలలోగా ఉన్న చిన్న ప్లాట్లను పక్కనే ఉన్న ప్లాట్ల యజమానులకు ప్రభుత్వ మార్కెట్ వాల్యూ ప్రకారం ఇవ్వకుండా వేలానికి పెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. వేలం ద్వారా ప్లాట్లను అమ్ముకునే ముందు కాలనీ వాసులకు దక్కాల్సిన 10 శాతం స్థలాన్ని చూపాలని, లేదంటే వేలం పాటను అడ్డుకుంటామని హెచ్చరించారు.



కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్ 1 ప్రవేశద్వారం

అనుమానాలు నివృత్తి చేస్తాం : ఈఈ

హౌసింగ్ బోర్డు స్థలాల వేలానికి సంబంధించి ఎలాంటి అనుమానాలు ఉన్నా సరే వేలం కంటే ముందే నివృత్తి చేస్తామని వెస్ట్రన్ డివిజన్ ఈఈ కిరణ్‌బాబు 'సాక్షి'కి తెలిపారు. రోడ్డు విస్తరణలో స్థలాలు పోతాయనే విషయంతో పాటు ఇతర ఏ అనుమానాలు ఉన్నా అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. అయితే నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా 'ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా' అనే పద్ధతిలో విక్రయిస్తామని, భవిష్యత్‌లో జరిగే రోడ్డు విస్తరణకు స్థలాలు పోతే వాటికి ఆయా శాఖల అధికారులు నష్టపరిహారం అందజేస్తారని ఆయన తెలిపారు.